క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలను ధైర్యంగా ఎదుర్కోవాలి



సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల భాష్యం పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో క్షేత్రస్థాయిలో మాక్‌డ్రిల్ ద్వారా తెలియజేశారు. దీంతో విద్యార్థులకు కొంత అవగాహన కలిగింది. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్‌లు షేక్ గౌస్, కె.శ్రీనివాసరావు, మోహన్ బాబు, సాగర్ బాబు, నాగేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అమరకుమారి మృతి

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు మాజీ సర్పంచ్ అమరకుమారి (68) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. 2013 నుంచి 2021 వరకు 75 త్యాళ్లూరు గ్రామ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళ నేతగా పని చేశారు. భర్త మేకల కృపానందం డీఎస్పీగా రిటైర్ అయి వైఎస్సార్‌సీపీలో కీలక నేతగా పనిచేశారు. అమరకుమారి మృతికి పలువురు సంతాపం తెలిపారు.



అమరకుమారి (పాతచిత్రం)

పురాతన బత్తిన వారి బావికి మరమ్మతులు చేయాలి



అమరావతి: మండలంలోని మల్లాదిలో ఉన్న రాష్ట్రంలోనే అతి లోతైన దిగుడు రాతి బావికి మరమ్మతులు చేసి భవిష్యత్ తరాలకు అందించే విధంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మల్లాది–తమ్మవరం మార్గంలో ఉన్న ఈ దిగుడు బావిని బత్తిన వారి బావిగా పిలుస్తారు. ఈ రాతి బావిని 1863వ సంవత్సరంలో కృష్ణానదికి దక్షిణాన మూడు కిలోమీటర్ల దూరంలో 150 అడుగుల లోతున 150 మెట్లతో 40 అడుగుల రాతి గోడలతో నిర్మించారు. ఈ బావి నేడు శిథిలావస్థకు చేరింది. ఎన్నో సంవత్సరాల క్రితం మల్లాది గ్రామస్తుడైన బత్తిన రామయ్య అప్పట్లో నీటి ఎద్దడిని నివారించడానికి, పశువులకు తాగునీటి కోసం కొండ రాతిని తొలచి దీనిని నిర్మించారు. ఈ బావిని రక్షిత కట్టడంగా ప్రకటించి గత చరిత్రను కాపాడటానికి పర్యాటక శాఖ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య మెమోరియల్ పార్కులో ఈ నెల 26 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ శిక్షణ తరగతులు జూలై 2 వరకు వారం రోజుల పాటు జరుగుతాయన్నారు. శిక్షణలో యోగాసనాలు, ప్రాణాయామం, మ్యూజికల్ ఎక్సర్‌సైజులు, రాజయోగ మెడిటేషన్ నేర్పించబడతాయన్నారు. ఆరోగ్యం కోసం నిర్వహించే ఈ శిక్షణ తరగతుల వలన ఎసిడిటీ, గ్యాస్ట్రిక్, బీపీ, షుగర్, ఊబకాయం, థైరాయిడ్, మైగ్రేన్, కీళ్ల నొప్పులు, మలబద్ధకం లాంటి శారీరక సమస్యలు, ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమి లాంటి మానసిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. బరువు తగ్గి ప్రాణశక్తి పెరుగుతుందని, మంచి ఆకలి, సుఖ నిద్ర, యాక్టివ్‌నెస్, మంచి ఆరోగ్యం, ఆనందంతో ఐశ్వర్యవంతులుగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 5:30 నుంచి 7:00 గంటల వరకు, సాయంత్రం 5.00 నుంచి 7.00 గంటల వరకు, మహిళలకు ఉదయం 10.00 నుంచి 12.00 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణకు హాజరయ్యే వారు యోగా మ్యాట్ లేదా బెడ్‌షీట్, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలన్నారు.

మరో ఐదు రోజులే గడువు..!

- మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించేందుకు దగ్గరపడిన గడువు
- జూలై ఒకటి నుంచి వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే
- అర్ధ సంవత్సరం ఆస్తి పన్ను డిమాండ్ రూ.3.32 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.1.40 కోట్లు



సత్తెనపల్లి ఏరియల్ వ్యూ

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించేందుకు సమయం దగ్గర పడుతోంది. ఏడాదిలో మొదటి అర్ధ సంవత్సరం పన్ను మొత్తం చెల్లించేందుకు ఈ నెల 30తో గడువు ముగియనుంది. నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించ కుంటే వడ్డీ భారం తప్పదని అధికారులు పేర్కొంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం పన్ను చెల్లించేందుకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండడంతో అధికారులు భవన యజమానులను అప్రమత్తం చేస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత చెల్లించే వారికి నూటికి రూ.2 చొప్పున వడ్డీ భారం పడుతుందని స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక సంవత్సరంలో రెండు దఫాలుగా మున్సిపల్ శాఖ పట్టణ పరిధిలో భవన యజమానుల నుంచి పన్నులు వసూలు చేస్తుంది. ఇందులో భాగంగా మొదటి విడతగా జూన్ నెల ఆఖరి వరకు వసూలు చేస్తారు. రెండో విడతగా డిసెంబర్ నెల లోగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రెండు విడతల్లో నిర్ణీత సమయానికి పన్ను చెల్లించని వారికి 2 శాతం వడ్డీ విధిస్తారు. ఇందులో భాగంగా జూన్ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సర పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో 15,892 అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించి డిమాండు రూ.3.32 కోట్లు ఉండగా... ఇప్పటి వరకు రూ.1. 40 కోట్లు వసూలు చేసినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కన మరో రూ.1.92 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

మొండి బకాయిలపై దృష్టి సారించేనా...

గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరిగినప్పటికీ 2023– 24 ఆర్థిక సంవత్సరంతో పాటు గడచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం కొంత విఫలమవుతుంది. దీంతో ఆస్తి, నీటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల నుంచి వసూలు కావాల్సిన మొత్తం కోట్ల రూపాయల్లో ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఒక్క ఆస్తి పన్ను రూ.69 లక్షలు పాత బకాయిలు ఉండగా.. ప్రస్తుత అర్ధ సంవత్సరానికి సంబంధించి రూ.1.92 కోట్లు ఉన్నాయి. పాతబకాయిలతో కలిపి రూ.2.61 కోట్లు వసూలు కావాలి. ఇవి కాక నీటి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి పేరుకుపోయిన బకాయిలు రాబడితే పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

పన్నులు చెల్లించడం బాధ్యత



పట్టణంలో భవనాలు, నీరు, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాం. ఈ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సర పన్ను మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. లేని పక్షంలో వడ్డీ భారం తప్పదు. ఈ విషయంపై యజమానులకు నోటీసులు జారీ చేశాం. కొంత మంది పన్నులు చెల్లించేందుకు నిరాసక్తత చూపించారు. ప్రజలంతా సహకరించి పన్నులు చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధికి సహకరించాలి.

–కొలిమి షమ్మి,
మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమారాణి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమారాణి, పక్కన జిల్లా అధికారి ఉమామహేశ్వరి

అచ్చంపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించవలసి ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ఉమారాణి తెలిపారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ప్రాజెక్టు స్థాయి సమావేశంలో ఆమె పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు రాకుండా వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలను తల్లిదండ్రులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. అదే విధంగా రుతుక్రమంలో వచ్చే మార్పుల గురించి వివరించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో తెలియపరచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, గర్భిణులకు అందజేసే వసతులను వివరించాలన్నారు. ప్రీస్కూల్ నిర్వహణ, కిచెన్‌గార్డెన్ పనితీరు తదితర విషయాలను కూలంకషంగా తెలియపరచారు. చిన్నారులను ఆటపాటల ద్వారా ఎలా ఆకర్షించాలి, వారికి చదువుపై ఏవిధంగా దృష్టి మళ్లించాలి అనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి ఉమామహేశ్వరి, మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

కౌలు రైతులంతా సాగు పత్రాలు పొందాలి

ఏవో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న చిగురుపాడు సర్పంచ్ గంధం కోటేశ్వరరావు

అచ్చంపేట: కౌలు రైతులంతా తప్పనిసరిగా సాగు పత్రాలు పొంది బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు పొందాలని వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కోనూరు, కస్తల, చిగురుపాడు గ్రామాలలో మంగళవారం కౌలు రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. భూ యజమానుల హక్కులకు భంగం వాటిల్లకుండా పంట సాగు పత్రాలను 11 నెలల కాలపరిమితితో రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. చిగురుపాడు సర్పంచ్ గంధం కోటేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుంది తప్ప భూములపై ఎలాంటి హక్కు ఉండదన్నారు. అందువల్ల భూ యజమానులు కౌలు రైతులు బ్యాంకులలో రుణాలు పొందేందుకు ఎలాంటి అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అంతే కాక కౌలు పత్రాలకు కేవలం 11 నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుందన్నారు. పంట సాగు హక్కు పత్రాలకు కౌలు రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట నమోదుకు, పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పొందేందుకు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలను పొందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు మాన్యానాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై గ్రామసభలు



మాదలలో గుర్తింపు కార్డు అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాదు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఎంపికపై మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణలు పాల్గొని కౌలు రైతులకు కార్డుల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందవచ్చన్నారు. కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడి బ్యాంకు ద్వారా రుణసాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా అర్హులైన కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (కౌలు రైతు కార్డు) అందించేందుకు సత్తెనపల్లి మండలం పెదమక్కెన, గుడిపూడి, నందిగామ–1, నందిగామ–2 గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు ఎల్.జయపాల్, ఎం.తిరుపతిరావు, షేక్ మహబూబ్ సుభానీ, బి.కోటేశ్వరమ్మ, వీహెచ్‌ఏలు కె.రామకోటిరెడ్డి, పి.సామంత్‌రెడ్డి, షేక్ మౌలాల్లి, జి.గోపీకృష్ణలు హాజరై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తులు అందించాలని కోరారు. ఆయా సభల్లో కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ సాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాల మేరకు ఈ నెల 29న మండల న్యాయ సేవా కమిటీ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో ఉన్న కోర్టుల యందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని సత్తెనపల్లి న్యాయ సేవ సాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టులలో పెండింగులో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంకు, మనోవర్తి కేసులు, సివిల్ తగాదాలు, రెవెన్యూ, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని, కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులు ప్రారంభం



సత్తెనపల్లి: వర్షాకాలం ఆరంభ సమయంలో ముందస్తుగా డ్రైనేజీల్లో పూడికలు తీయటం సర్వ సాధారణమైన విషయమే. దీనిలో భాగంగా స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మంగళవారం పట్టణంలోని గార్లపాడు రోడ్‌లోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి క్షేత్రస్థాయిలో పర్యటించి డ్రైనేజీల్లో పూడికతీతను పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, గడ్డిని తొలగింపజేసి మురుగు నీరు సాఫీగా ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

28న బాలుర గురుకులంలో ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 28న ప్రవేశ పరీక్ష జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఒట్టిప్రోలు జాన్సన్ మంగళవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు హాజరై ప్రతిభ చూపిన వారిని ఆయా తరగతుల్లో భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

రేపు పడవల నిర్వహణకు వేలం

అచ్చంపేట: మండల సరిహద్దులోని కృష్ణానదిపై పడవల ద్వారా ప్రయాణికులను నది దాటించే హక్కు పొందేందుకు ఈ నెల 27న గుంటూరు జెడ్పీ సమావేశపు హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడతాయని ఎంపీడీవో కుసుమకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెజిట్ నిబంధనల మేరకు 2024–25 సంవత్సరానికి అంటే జూలై 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు 9 నెలల కాలానికి కృష్ణానదిపై పడవలు, బల్లకట్టు నడుపుకునే హక్కు ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ధరావతుగా ప్రభుత్వం నిర్ణయించిన సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు. అచ్చంపేట మండలం చామర్రు నుంచి కృష్ణా జిల్లా కాసరబాద వరకు అప్‌సెట్ మనీ రూ.2,07,000 కాగా ధరావతు రూ.69 వేలు, చింతపల్లి నుంచి కృష్ణా జిల్లా ఇస్తేపల్లి వరకు అప్‌సెట్ మనీ రూ.1.65 లక్షలు కాగా ధరావతు రూ.55 వేలు, గింజుపల్లి నుంచి వేదాద్రి వరకు అప్‌సెట్ మనీ రూ.97,500 కాగా ధరావతు సొమ్ము రూ.32,500, తాడువాయి నుంచి రామన్నపేట వరకు అప్‌సెట్ ప్రైస్ రూ.8,49,750 కాగా ధరావతు రూ.2,83,000, మాదిపాడు నుంచి ముక్త్యాల వరకు అప్‌సెట్ ప్రైస్ రూ.9,93,750 కాగా రూ.3,31,000 ధరావతుగా చెల్లించాలన్నారు. మాదిపాడు నుంచి తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా బొగ్గమాదారం వరకు కృష్ణనదిపై బల్లకట్టు ద్వారా వాహనాలు తరలించే హక్కుకై అప్‌సెట్ ప్రైస్ రూ.7.50 లక్షలు కాగా ధరావతుగా రూ.2.50 లక్షలు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని హెచ్ కక్ష్యలో గానీ లేదా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించవచ్చని చెప్పారు.

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

హెచ్‌ఎం బలరామ్‌నాయక్



కిట్స్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాయకులు

బెల్లంకొండ: బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని వెంకటాయపాలెం ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం బలరామ్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడి బయట విద్యార్థులు, నూతన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు గల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బెల్ట్, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సదుపాయం ఉపయోగించుకుని ప్రతి విద్యార్థి మంచి స్థాయికి ఎదగాలని గ్రామ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టెంశెట్టి శివనాగమణి, మాజీ ఎంపీటీసీ మేకం భాస్కరరావు, పాఠశాల చైర్మన్ కొలగాని వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచ్ భుక్యా నాగమ్మబాయి, శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ మేకం శ్రీరామమూర్తి, యల్లమందరావు, దీపాల కోటేశ్వరరావు, చందు కోటేశ్వరరావు, మెరుగు ఏడుకొండలు, ప్రకాష్, చేవూరి టీకలయ్య, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అరుణకుమారి, స్వాతి, అల్లాభీ, ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రాలతో రైతులకు మేలు

మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య



మన్నెసుల్తాన్‌పాలెంలో మాట్లాడుతున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ: కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలతో ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు సాగు చేయు రైతులందరు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రాలు పొందాలని తెలిపారు. భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబర్‌తో గ్రామ రెవెన్యూ అధికారి, రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి సీసీఆర్‌సీ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట సాగుదారు హక్కు పత్రం 11 నెలలు గడువు కలిగి భూ యజమాని హక్కులకు భంగం కలుగకుండా జారీ చేయబడుతున్నారు. పంట నమోదు తద్వారా పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పొందుటకు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం సంభవించిన పంట నష్ట పరిహారం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు పొందుటకు ఈ హక్కు పత్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. కావున భూ యజమానులు పంట సాగుదారులకు సహకరించాలన్నారు. అర్హులైన వారు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లక్ష్మీనారాయణ, వీఏఏ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ముందుంటుంది



సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న సంఘ సభ్యులు

పెదకూరపాడు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ ముందుంటుందని ఎస్టీయూ జిల్లా నాయకులు షేక్ నయనతుల్లా, ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సంఘ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. జీవో నంబరు 117ను రద్దు చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని, బదిలీలు పాత విధానంలో కొనసాగించాలని, యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులు సంఘ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించేందుకు ఎస్టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాన్‌సైదా, ప్రధాన కార్యదర్శి రమేష్, సురేష్, చంద్రయ్య, సతీష్ పాల్గొన్నారు.

సత్రశాల దేవస్థానంలో ప్రతిష్ఠించనున్న పంచలోహ విగ్రహాలు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో పలు దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలను త్వరలో ప్రతిష్ఠించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు. భక్తులు అందజేసిన రూ.4 లక్షల ఆర్థిక సహాయంతో తయారుచేసిన ఏడు పంచలోహ విగ్రహాలను (బుద్ధి, సిద్ధి, గణపతి, శ్రీవల్లి, దేవసేన, సుబ్రమణ్యేశ్వర, అన్నపూర్ణాదేవి) తిరుమల తిరుపతి దేవస్థానం వారు పంపించడం జరిగిందన్నారు. ఈ ఏడాది మార్చి 6వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, గంగా పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి, సువర్చల సమేత ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలను దేవస్థానం ఆవరణలో ప్రతిష్ఠించినట్లు తెలిపారు.

డీఏఏబీ చైర్మన్ పదవికి రాజీనామా



కుర్రి సాయి మార్కొండారెడ్డి

వెల్దుర్తి: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న కుర్రి సాయి మార్కొండారెడ్డి మంగళవారం తన పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో డీఏఏబీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు మేలు చేసే ఉద్దేశంతో అనేక మంచి పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. అందులో భాగంగా రైతులకు పంటల పట్ల అవగాహన, సలహాలు, సూచనలు చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినందున ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశానన్నారు. వ్యవసాయ సలహా మండళ్లు చాలా బాగా పనిచేశాయన్నారు. వ్యవసాయ రంగంలో మాజీ సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు అద్భుతంగా జరిగాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనను నమ్మి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన జిల్లా అధికారులు, మండల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందని ఆశిస్తున్నానన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. గురజాల నుంచి మాచర్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న మండలంలోని కొత్తపాలువాయి గ్రామానికి చెందిన తియ్యగూర కోటిరెడ్డిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డికి తీవ్రగాయాలు కాగా వెంటనే 108 వాహనం ద్వారా గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు రెంటచింతలలోని ఇండియన్ పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు పరిశీలిస్తున్నారు.

ప్రతి నెలా గ్రామ సభలు నిర్వహించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక నాయకులు

నకరికల్లు: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి నెల క్రమం తప్పకుండా గ్రామ సభలు నిర్వహించాలని సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక మండల అధ్యక్షుడు ముజావర్ జాన్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో డి.జయమణికి ఐక్యవేదిక తరఫున మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు బి.విశ్వేశ్వరరావు, మడకా వెంకటేశ్వర్లు, బి.వి.గిరి, ఆర్.రాజేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, షేక్ బాజి, షేక్ సైదా, షేక్ మస్తాన్ వలి, షేక్ డి.వలి తదితరులు పాల్గొన్నారు.